సాక్షి
చిత్తూరు

మంగళవారం । 17 । జూన్ । 2025



అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

గత వారం చిత్తూరులో నగల దుకాణంలో చోరీ చేసిన అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. - 8లో



మామిడి తోటలో గజదాడులు

పలమనేరు మండలంలోని ఎలిఫెంట్ క్యాంప్ సమీపంలో ఉన్న మామిడితోటల్లో ఏనుగులు దాడి చేసి విధ్వంసం సృష్టించాయి. - 8లో



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

వేతనాలు పెంచాలని కోరుతూ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. - 8లో



చిత్తూరు: గంగాసాగరం ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగిన రైతులు

మామిడి పోరు

జిల్లాలోని మామిడి రైతులకు దిక్కులేకుండా పోయింది. అధికారులు, పాలకుల మాటలను ఫ్యాక్టరీ యజమానులు లెక్క చేయడం లేదు. దీంతో మామిడి కాయలు అమ్ముకోవడానికి పోరాటం చేయాల్సి వస్తోంది. చిత్తూరు, జీడీ నెల్లూరు, తవణంపల్లె, బంగారుపాళ్యం మండలాల్లో సోమవారం టోకెన్లు ఇవ్వలేమని ఫ్యాక్టరీలు బోర్డులు పెట్టేశాయి. దీంతో ఫ్యాక్టరీల ఎదుట రైతుల ఆందోళనకు దిగి రోడ్లపై బైఠాయించారు. రహదారులపై ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో కొన్ని ఫ్యాక్టరీలు నామమాత్రంగా టోకెన్లు ఇచ్చాయి. అయినా రైతుల గోడును పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం.

– కాణిపాకం

- పంట అమ్ముకోవడానికి తంటాలు
- పడిగాపులు కాసి కాసి సహనం కోల్పోయిన వైనం
- రోడ్డెక్కిన రైతులు.. స్తంభించిన ట్రాఫిక్
- జీడీనెల్లూరు, బంగారుపాలెం, తవణంపల్లెలోనూ అదే తంతు!
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

జిల్లాలో ప్రస్తుతం తోతాపురి రకం మామిడి కాయలు పక్వానికి రావడంతో కోతలు జోరందుకున్నాయి. ఈ కాయలను ఫ్యాక్టరీ నిర్వాహకులు కొనడం లేదు. ఏదో కొన్ని ఫ్యాక్టరీలు మాత్రం బయట రాష్ట్రాల నుంచి వచ్చే తోతాపురి కాయలను కొనుగోలు చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తోతాపురి కిలో రూ.8కు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినా ఫ్యాక్టరీలు వాటిని లెక్కచేయడంలేదు.

చిత్తూరులో ఏం జరిగిందంటే...

చిత్తూరు నగరం గంగాసాగరంలోని ఓ గుజ్జు పరిశ్రమ సోమవారం టోకెన్లు ఇస్తున్నట్లు వారం రోజుల ముందే బోర్డు పెట్టింది. టోకెన్లు ఇస్తారని మామిడి రైతులు ఆదివారం అర్ధరాత్రి నుంచే ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. అక్కడే కునుకు తీస్తూ.. ఆధార్, పట్టా పాసు పుస్తకం జెరాక్స్ నకలను క్యూలో పెట్టారు. ఉదయం 7గంటలకు రైతులు అక్కడికి అధిక సంఖ్యలో చేరుకున్నప్పటికీ ఫ్యాక్టరీ నిర్వాహకులు స్పందించలేదు. దీంతో రైతులంతా కలిసికట్టుగా చిత్తూరు–వేలూరు జాతీయ రహదారిపై బైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఫ్యాక్టరీ వాళ్లతో మాట్లాడారు. టోకెన్లు ఇస్తామని చెప్పడంతో ఆ తర్వాత ఫ్యాక్టరీ గేటును రైతులు చుట్టుముట్టేశారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. అక్కడ రైతుల అరుపులు, కేకలతో ఫ్యాక్టరీ ఆవరణ దద్దరిల్లింది. అక్కడే ఉన్న వృద్ధురాలికి ఊపిరి ఆడలేదు. వెంటనే రైతులు ఆ వృద్ధురాలిని ఫ్యాక్టరీ లోపలికి పంపారు. ఆపై అరకొరగా టోకెన్లు ఇచ్చిన ఫ్యాక్టరీ నిర్వాహకులు వచ్చేనెల 5వ తేదీ టోకెన్లు ఇస్తామంటూ మరో బోర్డు పెట్టారు. దీంతో టోకెన్లు అందని రైతులు మళ్లీ నిరసనకు దిగారు.

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

రైతులు తాము పండించిన మామిడి కాయలు అమ్ముకోవడానికి చావో రేవో అని పోరాడుతున్నారు. అయినా ఈ ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు. రాత్రి, పగలు తేడా లేకుండా నిద్రాహారాలు మాని ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటివరకూ ఏ ఒక్క అధికారి కానీ, ప్రజాప్రతినిధి కానీ వారి వైపు కన్నెత్తి చూడడం లేదు.

పలుచోట్ల ఇదే పరిస్థితి

గంగాధర నెల్లూరు మండలంలో మూడు రోజులుగా మామిడి కాయలను ట్రాక్టర్ల నుంచి అన్‌లోడింగ్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ రైతులు రోడ్డెక్కడంతో రాకపోకలు స్తంభించాయి. ఇప్పటికే ఫ్యాక్టరీ వద్ద ట్రాక్టర్లు భారీ సంఖ్యలో క్యూకట్టాయి. బంగారుపాళ్యం మండలంలో కూడా ఫ్యాక్టరీలు టోకెన్లు ఇవ్వకుండా తలుపులు వేసేశాయి. వచ్చే నెల టోకెన్లు ఇస్తామని ముఖం చాటేశాయి. ఒక చేసేది లేక రైతులు ఫ్యాక్టరీ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగి, చివరికి రోడ్డుపైకి వచ్చి ధర్నా చేశారు. తవణంపల్లె మండలంలోని ఫ్యాక్టరీలు కూడా మామిడి రైతులకు టోకెన్లు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నాయి.

కూటమి నేతల సిఫార్సులకే టోకెన్లు

కూటమి నేతల సిఫార్సులకు మామిడి టోకెన్లు అమ్ముడుబోతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు, రెవెన్యూ, కలెక్టరేట్, ఇతరత్రా అధికారుల పేర్లు చెబుతూ టోకెన్లను దండుకుంటున్నారని ఫ్యాక్టరీ నిర్వాహకులు బహిరంగంగా చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య రైతులు నిండా మునిగిపోతున్నారు. జిల్లాల్లో కొద్ది రోజులుగా హల్‌చల్ చేసిన రైతు సంఘం నాయకులు ఫ్యాక్టరీల ఎదుట కనిపించడం లేదు. వారి పంటను మాత్రం అమ్ముకుని వెళ్లిపోయారని రైతులు మండిపడుతున్నారు.

టోకెన్ల కోసం ధర్నా చేశాం



టోకెన్లు ఇస్తారని గంగాసాగరంలోని ఫ్యాక్టరీ వద్దకు వేకువజామున 4 గంటలకు వచ్చాం. టోకెన్లు ఇవ్వకపోవడంతో ధర్నాకు దిగాం. ఆ తర్వాత టోకెన్లు ఇస్తారని చెప్పడంతో పాలోమని ఫ్యాక్టరీ గేటు వద్దకు వెళ్లడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో ఇద్దరు మహిళలు స్పృహ తప్పి పడిపోయారు.

–కస్తూరి, అనుపల్లి, చిత్తూరు నగరం

రైతుల వద్దకే టోకెన్లు ఇవ్వాలి



అర్ధరాత్రి వచ్చామండి. వీళ్లు తెల్లారి 7 గంటలవుతున్నా టోకెన్లు ఇవ్వలేదు. అంతకు ముందే ఇచ్చుంటే ఈ గోల ఉండి ఉండదు. ఒక్క టోకెన్ కోసం ఈ దుస్థితి ఏమిటో మాకు అర్థకావడంలేదు. రైతుల పరిస్థితి ఇప్పుడు దారుణంగా ఉంది. టోకెన్లు సక్రమంగా ఇస్తే బాగుంటుంది. లేకుంటే మేమంతా కలిసి రోడ్డెక్కాల్సిందే.

–ధనంజయ్యనాయుడు, వరదరాజులపల్లి, చిత్తూరు మండలం

ఎందుకీ మీనమేషాలు?



ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఈ సంవత్సరం మామిడి ఆర్డర్లు ఉన్నప్పటికీ కొనటానికి మీనమేషాలు లెక్కిస్తున్నాయి? కూటమి ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. మామిడి రైతులు గుజ్జు పరిశ్రమలకు లాభాలు అందిస్తుంటే ... నిర్వాహకులు మాత్రం రైతును ముప్పుతిప్పలు పెట్టి నష్టాల్లో ముంచేస్తున్నారు.

– ప్రవీణ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం నాయకులు









బంగారుపాళెం: సన్‌గోల్డ్ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద టోకెన్ల కోసం రైతుల ఆందోళన, జీడీ నెల్లూరు: బారులు తీరిన మామిడి కాయల ట్రాక్టర్లు, బంగారుపాళెం: టోకెన్ల కోసం క్యూ కట్టిన రైతులు, చిత్తూరు: ఫ్యాక్టరీ గేటు తోసుకుని లోపలికి చొచ్చుకు పోతున్న రైతులు

మామిడి రైతుకు అండగా ఉంటాం

- రైతుల ఆందోళనపై తక్షణం ప్రభుత్వం స్పందించాలి
- కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయాలి
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని సోమవారం పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి రైతులు కన్నీరు పెడుతున్నా కూటమి ప్రభుత్వానికి కనికరించడం లేదని మండిపడ్డారు. రైతుల గోడుపై తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. కచ్చితంగా మామిడి కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయించాలని, లేకుంటే వైఎస్సార్‌సీపీ ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతుందని హెచ్చరించారు. మామిడి రైతుకు న్యాయ జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఆయన మాటల్లోనే..

- మామిడికి కనీస గిట్టుబాటు ధర కూడా దక్కడం లేదు. ఫ్యాక్టరీలు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి.
- మామిడి రైతులు తమ పంటలను ట్రాక్టర్లో తీసుకువచ్చి ఫ్యాక్టరీల ముందు రోజుల తరబడి పడిగాపులు కాస్తుంటే, పొరుగు రాష్ట్రాల మామిడి నేరుగా ఫ్యాక్టరీల్లోకి వెళ్లిపోతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం పనిచేస్తోందా? సరిహద్దుల్లో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని చెబుతున్నారు. అయితే.. ఇతర రాష్ట్రాల నుంచి వాహనాల్లో మామిడి ఎలా వస్తోంది. ఫ్యాక్టరీ నిర్వాహకులతో కూటమి నేతలు కుమ్మక్కై రైతులను నాశనం చేస్తున్నారు.



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- తోతాపురి రకం అమ్ముడుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదుకోవాలంటూ మామిడి రైతులు రోడ్డెక్కారు. జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు చేస్తున్నారు.
- గుజ్జు ఫ్యాక్టరీలు కాయల కొనుగోలుకు టోకెన్ విధానం తీసుకువచ్చాయి. ఈ టోకెన్ల కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. అయితే ఫ్యాక్టరీలు మాత్రం అరకొర టోకెన్లు మాత్రమే జారీ చేస్తున్నాయి. మిగిలినవి కూటమి నేతలు చెప్పిన వారికే గంపగుత్తగా ఇచ్చేస్తున్నాయి.
- ప్రభుత్వం సైతం జిల్లా రైతులను దగా చేస్తోంది. కూటమి నేతల కోసం ఫ్యాక్టరీలకే కొమ్ముకాస్తోంది. మామిడి కిలోకి రూ.12 గిట్టుబాటు అవుతుందని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తోంది. క్షేత్రస్థాయిలో ఫ్యాక్టరీలు కేవలం రూ.6 మాత్రమే రైతులకు చెల్లిస్తున్నాయి.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుజ్జు ఫ్యాక్టరీల వారు పంట కొనుగోలు చేసిన వారానికే రైతులకు నగదు అందించేవారు. ఇప్పుడు 3 నెలలకు ఇస్తామని తెగేసి చెబుతున్నారు. కాదంటే సరుకు కొనం.. వెళ్లిపోండి అని తరిమేస్తున్నారు.
- గతంలో తోతాపురి రకం కోత సమయంలో పండు కాయలు తక్కువ ధరకు కొనేవారు. ఇప్పుడు చిన్న మచ్చ ఉన్నా గ్రేడింగ్‌లో పారేస్తున్నారు.
- మామిడి కొనుగోలు విషయంలో రైతుల గోడును కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ధర పడిపోతే ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు నష్టపోకుండా కొనుగోలు చేయించింది.
- కూటమి ప్రభుత్వానికి అమరావతి తప్పమామిడి రైతుల కష్టాలు కనిపించడంలేదు. మామిడి రైతులకు న్యాయం జరిగేవరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదు.
- వైఎస్సార్‌సీపీ ప్రత్యేక కార్యాచరణతో రైతులకు అండగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం మెడలు వంచి, గిట్టుబాటు రేటుకు మామిడిని కొనుగోలు చేయించే వరకు పోరాటం కొనసాగిస్తుంది.

- తోతాపురి పంటను ఫ్యాక్టరీలు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపడం లేదు. రైతుల ఆగ్రహం చూసిన కూటమి ప్రభుత్వం కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయాలని ఫ్యాక్టరీలను ఆదేశించి చేతులు దులుపుకుంది. ప్రభుత్వం తరపున కిలోకు రూ.4 చొప్పున ప్రోత్సాహక నిధి ఇస్తామని గొప్పగా ప్రకటించింది. అయితే ఎక్కడా అమలు జరగడం లేదు.

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పినట్లు ఎక్కడైనా కిలో మామిడి రూ.8కు కొనుగోలు చేస్తున్నారా? నిరూపించే ధైర్యం కూటమి ప్రభుత్వానికి ఉందా? రైతులతో ఈ మాట చెప్పించగలరా? ఇంత దౌర్భాగ్య పరిస్థితి ఎప్పుడూ చూడలేదు.

- ఎకరా మామిడి సాగు చేయాలంటే కనీసం రూ.45వేలు ఖర్చవుతోంది. ఫ్యాక్టరీల వారు చిన్న మచ్చ ఉంటే కూడా కాయలు కొనడం లేదు. దీంతో రైతులకు కనీసం పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు.

శిశు మరణాలు లేని సమాజమే లక్ష్యం

చిత్తూరు కలెక్టరేట్ : శిశు మరణాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యమని ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపట్టాలని పేర్కొన్నారు. ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించి ఐదేళ్లలోపు పిల్లల జాబితా సిద్ధం చేయాలన్నారు. పిల్లలకు డయేరియా లక్షణాలుంటే వెంటనే ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలతో చికిత్స అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధారాణి, నోడల్ అధికారి హనుమంతరావు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

ఇంకెన్ని సార్లు తిరగాలో..?

- వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు విచ్చేసిన ప్రజలు
- వినతులు స్వీకరించిన ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి
- పీజీఆర్‌ఎస్‌లో నమోదైన అర్జీలు 254

చిత్తూరు కలెక్టరేట్ : "మా సమస్యలు ఇంకెన్ని సార్లు విన్నవించుకోవాలి, ఇంకెన్ని సార్లు తిరగాలో ఏమో.." అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు మార్లు అర్జీలిస్తున్నప్పటికీ తమ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని బాధితులు దిగులు చెందుతున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి అర్జీలను ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి స్వీకరించారు. పలు సమస్యలపై 254 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మోహన్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.


వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

క్లుప్తంగా

ఆటో దొంగల అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటోలు

చిత్తూరు అర్బన్: ఆటోలు చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను వన్‌టౌన్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పట్టుబడిన ఆ ఇద్దరినీ చిత్తూరు నగరంలోని పోలీసుల అతిథి గృహంలో సీఐ మహేశ్వర అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు, ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో ఆటోలు చోరీకి గురవుతున్నాయని పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు చేసిన దర్యాప్తులో దొంగలు తిరుపతివాసులుగా తేలడంతో వారిపై ప్రత్యేక నిఘా పెట్టి, చిత్తూరు కట్టమంచి వద్ద పట్టుకున్నట్లు వెల్లడించారు. వీరిద్దరూ తిరుపతి జీవకోనకు చెందిన కొండల ఆదినారాయణ, చిన్నంగారి షణ్ముగంగా గుర్తించారు. వారి నుంచి రూ.10.50లక్షలు విలువ చేసే మూడు ఆటోలు, ఒక ఆటో విడిభాగాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామని, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు ఉన్నారు.

దళితులను వెలివేయాలని చూస్తున్నారు



దళితులను గ్రామం నుంచి వెలివేయాలని అగ్రకులస్తులు చూస్తున్నట్లు చిత్తూరు నగరం మాపాక్షి రెవెన్యూ ఉయ్యాలచింత గ్రామస్తులు జయ, పార్వతి, జయసుధ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ గ్రామస్తులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చిత్తూరు నగరం 13వ వార్డు లో సర్వే నెంబర్ 123 లో 30 ఏళ్ల నుంచి జీవిస్తున్నామన్నారు. తమకు ప్రభుత్వం రాస్తా పోరంబోకు స్థలంలో ఇంటి స్థలాలు మంజూరు చేసిందన్నారు. ఇటీవల కొందరు అగ్రకులస్తులు వచ్చి వెలివేయాలని చూస్తున్నారన్నారు.

వేతనమైనా ఇవ్వండి... పథకాలైనా వర్తింపచేయండి

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ వేతనమైనా ఇవ్వాలి లేదా సంక్షేమ పథకాలైనా వర్తింప చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు లలిత, షకీల మాట్లాడుతూ సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా అంగన్‌వాడీలను నమోదు చేసి తప్పుచేశారన్నారు. వితంతువులకు పింఛన్‌లు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, ఏపీ అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు విజయ, సుజని, ధనకోటి, ప్రమీల, సరళ, కస్తూరి, లీలా పాల్గొన్నారు.



దివ్యాంగ పింఛన్ మంజూరు చేయండి



అన్ని అర్హతలున్నప్పటికీ తనకు దివ్యాంగ పింఛన్ ఇవ్వడం లేదని పలమనేరుకు చెందిన దివ్యాంగుడు నాగం ఆవేదన వ్యక్తం చేశారు. తనకు 100 శాతం వైకల్యం ఉన్నట్లు తెలిపారు. దివ్యాంగ పింఛన్ కోసం పలు మార్లు అధికారులకు అర్జీ ఇచ్చినప్పటికీ ఎవరూ న్యాయం చేయడం లేదని కన్నీరు మున్నీరయ్యారు. దివ్యాంగులపై కనికరం చూపాలని ఆవేదన వ్యక్తం చేశారు.

స్మార్ట్ మీటర్లు వద్దు



రాష్ట్ర ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు నష్టం జరిగే స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఆ సంఘం నాయకులు శ్రీనివాసమూర్తి, షౌకత్, మునస్వామి, రషీద్, రాజేంద్రన్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

చిత్తూరు అర్బన్: మున్సిపాలిటీలు నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఉద్యోగుల సంఘం నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు హెచ్చరించారు. సోమవారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామ్మూర్తి మాట్లాడుతూ, స్కిల్డ్ కార్మికులకు రూ.24,600 వేతనం అమలు చేయాలన్నారు. నాయకులు శరవణ, శివకుమార్, శివప్రసాద్, వెంకటేష్, హరికృష్ణ, సునీల్‌కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని 9,10, ఇంటర్ చదువుతున్న ఎస్సీ విద్యార్థులు తల్లికి వందనం పథకం లబ్ధి పొందేందుకు వెంటనే తల్లిఖాతాకు, విద్యార్థుల ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని సోషల్ వెల్ఫేర్ డీడీ విక్రమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు తమకు దగ్గరలో ఉండే గ్రామ, వార్డు సచివాలయాలలు, పోస్టాఫీసులో సంప్రదించి అనుసంధాన ప్రక్రియను ఈ నెల 17వ తేదీలోపు పూర్తి చేసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతా లేకుంటే పోస్టల్ బ్యాంక్‌లో నూతన ఖాతాను ప్రారంభించి ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని డీడీ వెల్లడించారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: ఫిర్యాదుదారులకు ఇబ్బంది కలిగించకుండా, వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వేధింపులు, కుటుంబ సభ్యులు, దారి సమస్యలకు సంబంధించి మొత్తం 14 అర్జీలు వచ్చాయి. వీటిని పరిశీలించి ఫిర్యాదులకు న్యాయం చేయాలని ఆయన ఆదేశించారు.

మామిడి తోటల్లో గజ దాడులు


ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి పంట

పలమనేరు: మండలంలోని ఎలిఫెంట్ క్యాంపు పక్కనే ఉన్న ముసలిమడుగు సమీపంలోని మామిడి తోటల్లో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసింది. కాయలను తిని, కొమ్మలను విరిచేసినట్టు గ్రామస్తులు తెలిపారు. పంటనష్టాన్ని స్థానిక ఫారెస్ట్ సిబ్బంది సోమవా రం పరిశీలించి పరిహారానికి నివేదికలు సిద్ధం చేశారు. అడవిలోంచి వచ్చి రైతుల పంటలను రుచిమరిగిన మదపుటేనుగులను కుంకీ ఏనుగులు అదుపు చేయడం చాలా కష్టమని ఇక్కడి రైతులు చెబుతున్నారు. అయితే ఇక్కడి ఏనుగుల సమస్యను కుంకీ ఏనుగుల ద్వారా అటవీశాఖ ఎలా కట్టడి చేస్తారో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

తండ్రి మరణానికి కారణమైన కుమారుడు అరెస్టు


మనోహర్ రెడ్డిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చౌడేపల్లె: కన్నతండ్రి మరణానికి కారణమైన కుమారుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు, చౌడేపల్లె మండలం అంకుతోటపల్లెకు చెందిన చిన్నప్ప రెడ్డి, రాజమ్మ దంపతుల కుమారుడు మనోహర్‌రెడ్డి ఆస్తి విషయమై మార్చి 30వ తేదీ తండ్రితో గొడవకు దిగాడు. ఇది కాస్త ఘర్షణకు దారి తీసింది. మనోహర్‌రెడ్డి చేసిన దాడిలో తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయన్ను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై మార్చి 31న 'కడుపున పుట్టికొ ళ్ళా... తోడేళ్లా అనే' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ ఘటనలపై స్పందించిన జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు పొందిన అనంతరం చిన్నప్ప రెడ్డిని స్వగ్రామానికి తీసుకొచ్చారు. అయితే ఆయన తీవ్ర మనోవేదనకు గురై ఏప్రిల్ 21వ తేదీ మృతి చెందాడు. తండ్రి మృతికి కారణమైన కుమారుడు మనోహర్‌రెడ్డి, కోడలు సరస్వతమ్మ పరారయ్యారు. ఈ క్రమంలో పోలీసులు సోమవారం మనోహర్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. పరారీలో ఉన్న సరస్వతమ్మను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ఇది ముంచే ప్రభుత్వం

- నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్న చంద్రబాబు
- ఆయనకు వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య
- '5 కోట్ల మందికి వెన్నుపోటు' పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి రోజా


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి రోజా, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు

నగరి : 'కూటమి నాయకులు మాది మంచి ప్రభుత్వం అంటూ డప్పు కొట్టుకుంటుంటే.. ప్రజలు మాత్రం ఇది ముంచే ప్రభుత్వం అంటున్నారు' అని మాజీ మంత్రి ఆర్కేరోజా ఎద్దేవా చేశారు. నగరి పట్టణంలోని తన నివాసంలో సోమవారం '5 కోట్లమందికి వెన్నుపోటు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబుకు అబద్ధాలు చెప్పడం, వెన్నుపోటు పొడవడం అనేది వెన్నతో పెట్టిన విద్య అని ముక్త కంఠంతో జనం చెబుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు ఇస్తామని ఏడాదైనా సూపర్ సిక్స్ పథకాలు అమలు లేదన్నారు. నిరుద్యోగ భృతి లేదు, మహిళలకు 50 ఏళ్లకే పెన్షన్ లేదు, ఉచిత బస్సు లేదు. 18 యేళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 లేదు, ఇప్పటి వరకు ప్రజలకు సెంటు భూమి ఇవ్వలేదని గుర్తుచేశారు. వైఎస్ జగన్ పొదిలి పర్యటనలో జన తాకిడి చూసిన తర్వాత భయపడి తల్లికి వందనం హడావుడిగా విడుదల చేశారన్నారు. అది కూడా 87 లక్షల మందికి అందాల్సిన పథకం కేవలం 57 లక్షల మందికి మాత్రమే ఇచ్చారని చెప్పారు. ఒకే ఆధార్ నెంబర్‌తో 349 మందికి, 54 మందికి, 92 మందికి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాల్లో చదివే విద్యార్థులను అనర్హత కింద పరిగణించారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.వెయ్యి తీసుకుంటే రాద్ధాంతం చేసిన చంద్రబాబు, నేడు రెండు వేలు వసూలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మూలన ఉండే ముసలమ్మ కూడా బలన్ నొక్కుతుందన్న చంద్రబాబు ఒక్క బటన్ నొక్కడం కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టే రెడ్ బుక్ రాజ్యాంగం పక్కన పెట్టి..ఎల్లో మేనిఫెస్టో అమలు చేయాలని హితవు పలికారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ పెరిగిపోయాయని వాటిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, మున్సిపల్ వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- వారం క్రితం నగల దుకాణంలో చోరీ
- ఎట్టకేలకు పట్టుబడిన నిందితుడు
- ఆభరణాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు


నిందితుడు ఆనంద్


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

చిత్తూరు అర్బన్: అంతర్రాష్ట్ర దొంగకు సినిమాలంటే మోజు. ఆ మోజుతో సినిమా తీసి అప్పుల్లో కూరుకుపోయాడు. బాలనేరస్తుడిగా మొదలై ప్రస్తుతం 23 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇటీవల చిత్తూరులోని ఓ బంగారు దుకాణంలో చోరీ చేసి పోలీసుల చేతికి చిక్కాడు. నగరంలోని పోలీసుల అతిథి గృహంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు సమక్షంలో పోలీసులు అతడిని అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. చిత్తూరు నగరం జెండామాను వీధిలోని శరవణ బంగారు దుకాణంలో ఈనెల 4వ తేదీన చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం తలుపులు పగలగొట్టి 126 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. షాపు యజమాని శరవణ ఆచారి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ ప్రారంభించిన పోలీసులు దొంగను పట్టుకోవడానికి కసరత్తులు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దొంగ జాడలను పసిగట్టారు. కర్ణాటక రాష్ట్రం ఎంఆర్‌ఎస్ పాళ్యకు చెందిన ఆనంద్‌గా నిర్ధారణకు వచ్చారు. చాకచక్యంగా అతడిని పట్టుకుని, రూ.11.80 లక్షలు విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.3 లక్షలు విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నారు. సినిమా మీద పిచ్చితోనే దొంగతనం చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కీచకుడు అనే కన్నడ సినిమాను తెరకెక్కించాడని..అయితే అది రిలీజ్‌కు నోచుకోలేదని పోలీసులు వెల్లడించారు. ఈ సినిమా పిచ్చి వల్ల చోరీలకు అలవాటు పడ్డాడని పోలీసులు వివరించారు. కర్ణాటక రాష్ట్రంలోని మాండ్యలో బాలనేరస్తుడిగా ముద్రవేసుకుని, మొత్తం 23 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య, ఇతర పోలీసు అధికారులను అడిషనల్ ఎస్పీతో పాటు డీఎస్పీ సాయినాథ్ అభినందించారు. బైక్ దొంగతనాలను అరికడుతామని, త్వరలో అరెస్టులు ఉంటాయని అడిషనల్ ఎస్పీ వెల్లడించారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలు షురూ!

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16వ తేదీన ఉత్తర్వులు జారీచేసింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఈ నెల 30వ తేదీ లోపు ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జారీచేసిన బదిలీల షెడ్యూల్ మేరకు జిల్లా యంత్రాంగం కసరత్తు నిర్వహించనుంది. మే 31వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక వేళ ఐదేళ్లు పూర్తికాకపోతే ఉద్యోగులు తమ వ్యక్తిగత అభ్యర్థనపై బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బదిలీ అయ్యే ఉద్యోగుల వివరాల నమోదు ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బదిలీలకు ఉద్యోగులు ఈ నెల 22 నుంచి 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల పరిశీలన ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. బదిలీ పూర్తయిన తర్వాత జూలై 10వ తేదీ లోగా ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వోల్వో బస్సు ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన అష్రఫ్

గంగవరం: వోల్వో బస్సు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు బైరెడ్డిపల్లె మండలం మేకల నాగిరెడ్డిపల్లెకు చెందిన అష్రఫ్(35) బైక్‌పై పలమనేరు–బెంగళూరు జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో బయల్దేరారు. అదే సమయంలో బెంగళూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న వోల్వో బస్సు బైక్‌ను ఢీకొంది. దీంతో అష్రఫ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంత నీచ రాజకీయం తగదు బాబూ..


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప తదితరులు

పుంగనూరు(చౌడేపల్లె): ఇలాంటి నీచ రాజకీయాలు గతంలో ఎప్పుడూ చూడలేదని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప అన్నారు. ఆయన సోమవారం పుంగనూరులో పార్టీ నాయకులతో కలిసి జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా చంద్రబాబు ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు, మహిళలకు రక్షణలేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలీం బాషా, రాష్ట్ర జానపద కళల మాజీ చైర్మన్ కొండేటి నాగభూషణం, రాయలసీమ మైనారిటీ విభాగం నాయకుడు ఫక్రుద్దీన్ షరీఫ్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు అమరనాథరెడ్డి, ఇర్ఫాన్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భక్తులు సంతృప్తి చెందేలా చర్యలు


వసతులపై ఆరా తీస్తున్న కమిషనర్

చౌడేపల్లె: ఆలయాలకు వచ్చే ప్రతి భక్తుడు సంతృప్తిగా దైవ దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్ తెలిపారు.షాయన సోమవారం బోయకొండలో పర్యటించగా, ఈఓ ఏకాంబరం స్వాగతం పలికారు. ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు అందుతున్న సేవలు, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంయుక్త కమిషనరేట్ పరిధిలో ఉన్న 7 ఆలయాలు, ఉపకమిషనరేట్ పరిధిలో ఉన్న 17 ఆలయాలను సందర్శిస్తున్నట్లు చెప్పారు.

చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక శ్రద్ధ

పాలసముద్రం : చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎస్‌డబ్ల్యూపీసీ జిల్లా కో–ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి తెలిపారు. శ్రీకావేరిరాజుపురంలోని చెత్త సేకరణ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలన్నారు. ఆ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు.